సాక్షి
అనంతపురం
సోమవారం । 23 । డిసెంబర్ । 2024



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.16 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని గుంతకల్లులో ఓ రైల్వే ఉద్యోగి ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంటోంది. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.2°/17.8°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

హైకోర్టు జడ్జి సురేష్‌రెడ్డికి ఘన స్వాగతం



జడ్జికి బొకే అందజేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

అనంతపురం టవర్‌క్లాక్: జిల్లాకు విచ్చేసిన హైకోర్టు జడ్జి సురేష్‌రెడ్డికి ఇన్‌చార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జడ్జి సురేష్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లా సమస్యలపై చర్చించారు.

విశా ఫెర్రర్‌కు ఉమెన్ అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న విశా ఫెర్రర్

అనంతపురం: ఆర్డీటీ మహిళా సాధికారిత డైరెక్టర్ విశా ఫెర్రర్‌ను 'సౌత్ ఇండియన్ ఉమెన్ అచీవ్‌మెంట్ అవార్డు-2024' వరించింది. ఆర్డీటీ తరఫున మహిళా సాధికారితకు విశేషంగా కృషి చేసినందుకు గాను ఆమె ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం బెంగళూరులోని కేఈఏ ప్రభాత్ ఆడిటోరియంలో సౌత్ ఇండియన్ ఉమెన్ అచీవ్‌మెంట్ అవార్డు (ఎస్‌ఐడబ్ల్యూఏఏ) సంస్థ సీఈఓ రాధ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

పటిష్ట స్థితిలో మహారాష్ట్ర జట్టు

- సెంచరీతో చెలరేగిన కిరణ్ చోర్మలే



కిరణ్ చోర్మలే

అనంతపురం: బీసీసీఐ - ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా అనంతపురం ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజీలో నిర్వహిస్తున్న కూచ్ బెహర్ ట్రోఫీ అండర్-19 పోటీల్లో ఆదివారం ఆంధ్ర-మహారాష్ట్ర జట్లు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో తలపడ్డాయి. టాస్ గెలిచిన మహారాష్ట్ర జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 284 పరుగులతో పటిష్ట స్థితికి చేరుకుంది. మహారాష్ట్ర బ్యాటర్ కిరణ్ చోర్మలే 209 బంతుల్లో (6 సిక్సర్లు, 19 ఫోర్లు) 162 పరుగులతో చెలరేగాడు. శుస్రుత్ సావంత్ 6 ఫోర్లతో 59 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఆంధ్ర జట్టు బౌలర్ యువన్ 7 ఓవర్లలో 4 మేడిన్ ఓవర్లు వేసి, 4 పరుగులు మాత్రమే ఇచ్చి, రెండు కీలకమైన వికెట్లను తీశాడు. పి.ఆదిత్యరెడ్డి, బి.యశ్వంత్, ఎస్.రాజేష్ చెరొక వికెట్ పడగొట్టారు. బీసీసీఐ సెలెక్టర్ హరీ ్వందర్‌సింగ్ సోఢీ, ఏసీఏ ఏజీఎం డి.శివకుమార్, ఏడీసీఏ ప్రెసిడెంట్ పీఎల్ ప్రకాష్‌రెడ్డి, ఏడీసీఏ సెక్రెటరీ వి.భీమలింగారెడ్డి, ఏసీఏ సౌత్ జోన్ అకాడమీ అడ్మిన్ మేనేజర్ పి.కె.సాగర్ చౌదరి, మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ మిలింద్ గుంజాల్, ఏడీసీఏ కోశాధికారి షబ్బీర్ మ్యాచ్‌ను పర్యవేక్షించారు.

లయ తప్పుతోంది



☛ అనంతపురం రూరల్ పరిధిలోని సిండికేట్‌నగర్‌కు చెందిన భాస్కర్‌రాజుకు 32 ఏళ్లు. ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 8వ తేదీన ఉదయం ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మృతి చెందాడు. కారణమేమని డాక్టర్లను అడిగితే 'గుండెపోటు' అని చెప్పారు.

☛ బత్తలపల్లికి చెందిన ఉషారాణిదీ ఇదే పరిస్థితి. ఈమె వయసు 38 ఏళ్లు. ఎంబీఏ పూర్తిచేసిన ఈమె హైదరాబాద్‌లో పనిచేస్తోంది. ఉన్నఫళంగా ఛాతీలో నొప్పిరావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇంటెన్సివ్ కేర్‌లో అరగంట ఉన్నారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. గుండె పోటుతో చనిపోయింది.

- చిన్న వయసు నుంచే గుండెపోటు లక్షణాలు
- కొంప ముంచుతున్న ఆహారపు అలవాట్లు
- మద్యం, పొగతాగే వారిపై తీవ్ర ప్రభావం
- వ్యాయామం లేని వారికి డేంజర్ బెల్స్
- ఏడాదికి సగటున 20 వేల మందిలో లక్షణాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గుండె లయ తప్పుతోంది. ఎప్పుడు ఎలాంటి ఉపద్రవం వస్తుందో ఊహించలేని పరిస్థితి. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నామనుకునే యువతనూ భయపెడుతోంది. దూకుడు మీదున్న ఈ గుండెజబ్బుల నియంత్రణ అంతుచిక్కడం లేదు. గతంలో 50 ఏళ్లు దాటితే గానీ గుండెజబ్బులు వచ్చేవి కావు. పరిస్థితులు తల్లకిందులయ్యాయి. ఇంటర్మీడియెట్ చదువుతున్న 17 ఏళ్ల కుర్రాడు కూడా గుండెపోటుతో కుప్పకూలిపోవడం వైద్యులకే అంతుచిక్కడం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా 20 వేల మంది గుండెజబ్బుల బారిన పడుతున్నట్లు తేలింది.

దురలవాట్లే దుఃఖానికి కారణం..

నిండా 30 ఏళ్లు దాటని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గుండెపోటుతో మృతిచెందడం బాధాకరం. కానీ అతని అలవాట్లే కొంపముంచాయి. 80 శాతం మంది యువతీ యువకుల్లో గుండెపోటు రావడానికి సరైన ఆహార నియమాలు లేకపోవడం, వ్యాయామం అసలే లేకపోవడం కారణమని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఏటా సగటున 20 వేల మందికి పైగా గుండెపోటు అనుభవాలను చవిచూస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా మొత్తం జబ్బులకయ్యే వ్యయంలో 30 శాతం గుండె జబ్బులకే అవుతుండటాన్ని బట్టి చూస్తే వీటి తీవ్రత ఎలా ఉందో అంచనా వేయొచ్చు.



ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆరోగ్యశ్రీ కింద గుండెజబ్బుల చికిత్స వివరాలు		
సంవత్సరం	గుండె చికిత్సలు	వెచ్చించిన వ్యయం
2019-20	4,660	రూ.20.07 కోట్లు
2020-21	5,107	రూ.21.42 కోట్లు
2021-22	6,637	రూ.27.71 కోట్లు
2022-23	7,909	రూ.32.97 కోట్లు
2023-24	10,274	రూ.44.14 కోట్లు
2024 డిసెంబర్ 20 దాకా	7,530	రూ.34.45 కోట్లు
మొత్తం	రూ.180.76 కోట్లు	

వ్యాయామం నిల్..

రోజువారీ వ్యాయామం లేకపోవడం అత్యంత ప్రమాదకరంగా ఉంది. 80 శాతం మందికి వ్యాయామంపై అవగాహన లేదని వెల్లడైంది. దినసరి కేలరీలు ఖర్చు కావాలంటే కచ్చితంగా నడక ఉండాలనే అవగాహన అతికొద్ది మందిలో మాత్రమే ఉంది. మరోవైపు మితాహారం, పౌష్టికాహారం తినడంలోనూ సమతూకం లేదు. దీంతో పాటు మద్యం, సిగరెట్లు తాగే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. వీటివల్ల గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వారానికి 150 నిమిషాలు కనీస నడక మంచిదని వైద్యులు చెబుతున్నారు. మధుమేహం, రక్తపోటు ఉన్న వారికి నడక అత్యంత అవసరమని వైద్యులు పదే పదే సూచిస్తున్నారు.

కొలెస్ట్రాల్ ప్రమాదం చాలామందికి తెలియదు

శరీరంలో రెండు రకాల కొవ్వులుంటాయి. ఒకటి హెచ్‌డీఎల్ (హై డెన్సిటీ లిపోప్రొటీన్స్), రెండోది ఎల్‌డీఎల్ (లో డెన్సిటీ లిపోప్రొటీన్స్). ఈ రెండింటిలో హెచ్‌డీఎల్ మంచి కొలెస్ట్రాల్ కాగా, ఎల్‌డీఎల్ అత్యంత ప్రమాదకరం. 40 ఏళ్ల వయసు దాటాక కనీసం ఆరుమాసాలకు ఒకసారైనా షుగర్, బీపీ, కొలెస్ట్రాల్ టెస్టులు చేయించుకొని మందులు వాడితే గుండెపోటు నియంత్రించుకోవచ్చు.

నియంత్రణ సాధ్యమే



గుండె జబ్బుల నియంత్రణ అసాధ్యమేమీ కాదు. బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక జబ్బులను నియంత్రణలో ఉంచుకోవాలి. నడవడం, మెట్లెక్కడం వంటి శారీరక శ్రమ అవసరం. రోజూ 20 నిమిషాల ధ్యానం మంచిదే. రాత్రి కనీసం 8 గంటల నిద్ర ఉండాలి. ప్రొటీన్లతో కూడిన చిక్కుళ్లు, బఠానీ, చేపలు, బాదం, పిస్తా వంటివి తినడం మంచిది. ఊరగాయలు, చిప్స్ వంటి వాటికి దూరంగా ఉండటం, తగినంత నీరు తీసుకోవడం చేస్తే గుండెను పదిలంగా కాపాడుకోవచ్చు.

– డా.పి.సుధాకర్‌రెడ్డి, గుండె జబ్బుల నిపుణులు

ముగ్గురిపై అట్రాసిటీ కేసు

- అర్ధరాత్రివేళ ఇంటిని ఐషర్‌తో ఢీ
- గోడ కూలి తీవ్రంగా గాయపడిన దంపతులు



ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

గార్లదిన్నె: మండలంలోని ఇల్లూరుకు చెందిన శ్రీనివాసులు, రామాంజనేయులు, అల్లాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు గార్లదిన్నె పీఎస్ ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. ఈ నెల 20న అర్ధరాత్రి ఐచర్ వాహనంతో అదే గ్రామానికి చెందిన మణికంఠ ఇంటిని నిందితులు ఢీకొన్నారు. ఘటనలో ఇల్లు గోడ విరిగి పడడంతో లోపల నిద్రిస్తున్న దంపతులు మణికంఠ, స్వాతి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అప్రమత్తమై క్షతగాత్రులను అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఘటనపై ఆరా తీశారు. ధ్వంసమైన ఇంటిని పరిశీలించారు. అనంతరం నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. కాగా, ఎస్సీ, ఎస్టీలపై దాడులు, హత్యాయత్నాలకు పాల్పడితే సహించేది లేదని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సాకే గోవిందు పేర్కొన్నారు. మణికంఠ దంపతులపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మణికంఠ దంపతులను ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పరామర్శించారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇల్లు కోల్పోయిన మణికంఠకు వెంటనే పునరావాసం కల్పించి, కొత్త ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు.

లడ్డూ ప్రసాదమూ కరువే!

పెన్నహోబిలం ఆలయంలో ముందుకు సాగని టెండర్లు



పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం



మూతపడిన లడ్డూ కేంద్రం

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రముఖ పుణ్యక్షేత్రంగాను, పర్యాటక కేంద్రంగాను ప్రసిద్ధిగాంచింది. ఇక్కడకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి శ్రీవారిని దర్శించుకుంటుంటారు. అయితే భక్తులు లడ్డూ ప్రసాదానికి నోచుకోలేకపోతున్నారు. భక్తులు పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదం అందించేందుకు దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు ఇంత వరకు టెండర్లు పిలవలేదు. శని, ఆదివారాలతో పాటు పండుగ రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. శ్రీవారి భక్తులకు అందించే లడ్డూ తయారీ కోసం ఆలయ ప్రాంగణంలోనే ఒక గది కేటాయించారు. అక్కడ బ్రాహ్మణులు నియమ నిష్టలతో లడ్డూ తయారు చేయాలి. దేవదాయ అధికారులు సైతం పర్యవేక్షణ చేసి.. నాణ్యతను పరిశీలించి ధ్రువీకరించాల్సి ఉంటుంది. అనివార్య కారణాల వల్ల లడ్డూ ప్రసాదం తయారీ ఆగిపోయింది. ఆరు నెలలు అవుతున్నా తదుపరి లడ్డూ తయారీ ప్రక్రియకు సంబంధించి టెండర్లు పిలవకపోవడం పట్ల దేవదాయ శాఖ అధికారుల తీరుపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. భక్తుల రద్దీ సమయంలో లడ్డూ ప్రసాదం ఇవ్వకపోతే బాగుండదని కొందరు సిబ్బంది సహకారంతో బయటి దుకాణాల్లోంచి తీసుకొచ్చిన లడ్డూలను విక్రయించారు. అయితే లడ్డూ తయారీలో నాణ్యత లోపించిందని, అధిక ధర వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో అధికారులు బయటి లడ్డూలకూ మంగళం పాడేశారు. భక్తులు స్వామి దర్శనానంతరం తీర్థంతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం




ఆలయాల్లో భక్తులకు అందించే లడ్డూ ప్రసాదం తయారీ బాధ్యతలను దేవదాయ, ధర్మదాయ శాఖ బ్రాహ్మణులకు అప్పగించింది. ఇది వరకు లడ్డూ తయారు చేసి అందుబాటులో ఉంచేవాళ్లం. అనివార్య కారణాల వల్ల లడ్డూల తయారీ ఆగిపోయింది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం. బ్రాహ్మణుల ద్వారా లడ్డూ తయారీని పునరుద్ధరిస్తాం.

– సాకే రమేష్‌బాబు, ఈఓ, పెన్నహోబిలం

మాకు సంబంధం లేదు

- 'ప్రశ్నపత్రం తారుమారు'లో విద్యార్థినికి కాలేజీ యాజమాన్యం ఉచిత సలహా
- జవాబుపత్రం మూల్యాంకనానికి స్వీకరించాలని ఎస్కేయూకు విద్యార్థిని లేఖ
- సంతకం చేసేందుకు ప్రిన్సిపాల్ ససేమిరా



S.K. University,
Anantapur.
Subject:- Request for evaluation of Answer sheet against correct question paper.
Respected Sir/madam,
I am writing this letter to bring attention to an error that has occured by invigilator. unfortunately I was given NS1-131 instead of RS1-131, So please kindly take necessary action in favour of me. Hence I request you to evaluate my answer sheet using the question paper I have attempted (NS1-131)
I would be eternal thankful to you
Thanking you
S. Farhana
HTNO :-

విద్యార్థిని రాసుకున్న వినతిపత్రం

అనంతపురం ఎడ్యుకేషన్: డిగ్రీ ఫస్టియర్ మొదటి సెమిస్టర్ హిందీ పరీక్షలో రెగ్యులర్ విద్యార్థినికి సప్లిమెంటరీ ప్రశ్నపత్రం ఇచ్చిన నగరంలోని ఎస్‌ఎల్‌ఎన్ కళాశాల యాజమాన్యం... తాము చేసిన తప్పును సరిదిద్దుకునే ప్రయత్నం చేయకపోగా విద్యార్థినిదే తప్పు అంటూ వితండవాదం చేస్తోంది. ప్రశ్నపత్రం తారుమారు విషయంపై సదరు విద్యార్థిని ఫర్హానా అదేరోజు ఇన్విజిలేటర్‌ను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. తర్వాత మరుసటి రోజు పరీక్ష కోసం వెళ్లిన సమయంలో ఓ రిక్వెస్ట్ లెటర్ రాసుకుంది. ఇన్విజిలేటర్ కారణంగా ప్రశ్నపత్రం వేరేది ఇచ్చారు. హిందీ పరీక్షలో నష్టం వాటిల్లకుండా తాను రాసిన ఎన్ఎస్1-131 జవాబు పత్రాన్ని పరిగణనలోకి తీసుకుని మూల్యాంకనం చేయాలంటూ ఎస్కేయూ వీసీకి లేఖ రాసింది. ఇందులో కౌంటర్‌గా పరీక్ష కేంద్రం ప్రిన్సిపాల్ సంతకం కోసం వెళ్తే కలవనీయకుండా మహిళా అధ్యాపకురాలు అడ్డుకున్నారు. 'ఇలాంటివన్నీ మాకు సంబంధం లేదు, మీరే చూసుకోవాలి' అంటూ ఉచిత సలహా ఇచ్చి పంపారు. తాను ప్రిన్సిపాల్‌ను కలవాలని అడిగితే.. ప్రిన్సిపాల్ కూడా ఈ విషయమే చెప్పారంటూ అధ్యాపకురాలు గట్టిగా చెప్పినట్లు విద్యార్థిని వాపోయింది. చివరకు విద్యార్థిని తండ్రి వెళ్లి ప్రిన్సిపాల్‌ను కలిస్తే వినకుండా గట్టిగా కేకలు వేసి బయటకు పంపారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తనకు నష్టం జరగకుండా చూడాలని విద్యార్థిని ఫర్హానా విజ్ఞప్తి చేస్తోంది.

రీ-సర్వేకు రైట్ రైట్

- కూటమి సర్కార్ సైతం గత ప్రభుత్వ బాటలోనే
- నాడు విమర్శలు.. నేడు యూటర్న్ తీసుకున్న వైనం
- పైలట్ ప్రాజెక్టుగా 31 గ్రామాల్లో సర్వేకు సమాయత్తం
- ఇదివరకటిలానే డిప్యూటీ తహసీల్దార్లే మొబైల్ మెజిస్ట్రేట్లు



గతంలో రీ సర్వేలో భాగంగా రైతుల సమక్షంలో హద్దులు ఏర్పాటు చేస్తున్న అధికారులు (ఫైల్)

అనంతపురం అర్బన్: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చేకూర్చే దిశగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమగ్ర భూముల రీ-సర్వేకు చర్యలు చేపట్టింది. దీన్ని అప్పటి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ తప్పు పట్టింది. విమర్శలు గుప్పించి అవాస్తవాలతో కూడిన విషపు రాతలను ఎల్లో మీడియాలో రాయించింది. జనసేన-బీజేపీతో కలిసి టీడీపీ కూటమిగా ఏర్పడి రాష్ట్రంలో కొలువుదీరిన తర్వాత యూటర్న్ తీసుకుంది. గత ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తూ భూముల రీ-సర్వేకు సిద్ధమయ్యింది. సర్వే క్రమంలో తలెత్తే వివాదాల పరిష్కారానికి ప్రత్యేకంగా మండలానికి ఒక డిప్యూటీ తహసీల్దార్‌ను మొబైల్ మెజిస్ట్రేట్‌గా గత ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం వారు యథావిధిగా కొనసాగనున్నారు.

గతంలో పక్కాగా రీ-సర్వే..

జిల్లావ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 32 మండలాల్లో 503 గ్రామాలకు సంబంధించి 25,17,658.52 ఎకరాల భూముల రీ సర్వేకు గత ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంది. అన్ని గ్రామాల్లో డ్రోన్ ఫ్లైట్ల ద్వారా ఓఆర్‌ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) చిత్రాలను తీశారు. 499 గ్రామాలకు ఓఆర్‌ఐలు సిద్ధంగా ఉన్నాయి. అదే క్రమంలో 198 గ్రామాల పరిధిలోని 1,83,353 భూ కమతాలకు సంబంధించి 5,88,615.626 ఎకరాలు సర్వే చేసి హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ-సర్వే పూర్తయిన చోట్ల గ్రామ సభలను అధికారులు నిర్వహించారు. అయితే 1,83,353 భూ కమతాలకు గానూ 5,421 ఫిర్యాదులు (0.03 శాతం) మాత్రమే వచ్చాయి. దీన్నిబట్టి చూస్తే సర్వే ఎంత పక్కాగా జరిగిందనే విషయం సుస్పష్టం. మొత్తం ఫిర్యాదుల్లో సర్వేకు సంబంధించి 4,377 రాగా.... రెండు వేల ఫిర్యాదులు పరిష్కరించినట్లు అధికారులు చెప్పారు.

భూముల రీ-సర్వే సమాచారం	
సర్వే చేయాల్సిన గ్రామాలు	: 503
సర్వే చేయాల్సిన విస్తీర్ణం (ఎకరాల్లో)	: 25,17,658.51
గతంలో డ్రోన్ సర్వే పూర్తయిన గ్రామాలు	: 503
ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్‌లు వచ్చిన గ్రామాలు	: 499
గతంలోనే సర్వే పూర్తయిన గ్రామాలు	: 198
సర్వే చేసిన విస్తీర్ణం (ఎకరాలు)	: 5,88,615.626
ప్రస్తుతం సర్వే చేయాల్సిన గ్రామాలు	: 305
సర్వేకు ఉపయోగించే రోవర్లు	: 158
పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్న గ్రామాలు	: 31

పైలట్ ప్రాజెక్టుగా 31 గ్రామాల్లో సర్వే షురూ..

జిల్లావ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టుగా మండలానికి ఒకటి చొప్పున 31 గ్రామాల్లో రీ-సర్వే చేసేందుకు అధికారులు సమాయత్తం అయ్యారు. ఈ 31 గ్రామాల్లో 1,26,618.760 ఎకరాలు సర్వే చేయాల్సి ఉంటుంది. ప్రతి గ్రామంలో 200 నుంచి 250 ఎకరాల వరకు ఒక బ్లాక్‌గా మొత్తం 31 గ్రామాల్లో 506 బ్లాక్‌లు ఏర్పాటు చేశారు. సర్వే చేసేందుకు ఒక్కో గ్రామానికి నాలుగు టీమ్‌లను నియమించారు. ఒక్కొక్క టీమ్‌లో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక వీఆర్‌ఓ ఉంటారు. ఇక భూ వివాదాల పరిష్కారానికి గతంలో మాదిరిగానే మొబైల్ మెజిస్ట్రేట్‌గా డిప్యూటీ తహసీల్దారు వ్యవహరిస్తారు.

సర్వే ప్రక్రియలో మార్పు ఇదే..

భూముల రీ-సర్వే ప్రక్రియలో గత ప్రభుత్వ విధానాలనే ప్రస్తుతమూ కొనసాగిస్తున్నారు. ఇందులో మార్పుల విషయానికి వస్తే 13- నోటిఫికేషన్‌కు గతంలో 90 రోజులు, 6 లేయర్ పరిశీలనకు 45 రోజులు మొత్తం 135 రోజులు ఉండేది. ఆ వ్యవధిని ప్రస్తుతం 165 రోజులకు పెంచారు. నాడు వలంటీర్ల భాగస్వామ్యం ఉండేది. ప్రస్తుతం వారు లేకపోవడంతో 200 ఎకరాల నుంచి 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా ఏర్పాటు చేశారు. ఇక హద్దురాళ్లపై ఉన్న భూ సురక్ష పథకం పేరు తుడిపేయడం. ఇవి మాత్రమే ప్రస్తుతం జరిగిన మార్పులు.

26న గ్రామ సభలు



భూముల రీ-సర్వేకు సంబంధించి పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన 31 గ్రామాల్లో ఈ నెల 26న గ్రామ సభలు నిర్వహించనున్నాం. సర్వే ఈ నెలాఖరులో ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లుతో సిద్ధంగా ఉన్నాం.

– రూప్లానాయక్, ఏడీ, సర్వే భూ రికార్డుల శాఖ

ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ వేడుకలు



సాయి కుల్వంత్ మందిరంలో సంగీత కచేరీ



ప్రశాంతి నిలయంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ

పుట్టపర్తి అర్బన్: ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేశ విదేశాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున విచ్చేయగా ఆదివారం సాయంత్రం వేద పఠనంతో కార్యక్రమాలను మొదలు పెట్టారు. ఈ సందర్భంగా సాయి కుల్వంత్ మందిరంలోని సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించారు. క్రిస్మస్ ట్రీ, స్టార్స్, విద్యుత్ వెలుగులతో సాయికుల్వంత్ మందిరం మెరిసిపోతోంది. ఆస్ట్రియాకు చెందిన ప్రముఖ గాయని అనాలూవ్ నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను మంత్రముగ్ధులను చేసింది. ప్రముఖ సంగీత కళాకారులు డాక్టర్ తానియా గోల్డ్‌బర్గ్ వయోలిన్, స్టాన్‌సైడేజ్ పియానో, సాయిజిత్ తబల బృందం సహకారం అందించారు. పలువురు భక్తులు క్రిస్మస్ గ్రీటింగ్ కార్డులను మహాసమాధిపై ఉంచి సత్యసాయికి సమర్పించారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ కళాకారులను సత్కరించారు.



వేడుకలకు హాజరైన భక్తులు

క్లుప్తంగా

ప్రజాసమస్యల పరిష్కారమే అజెండా

- నేటి నుంచి సీపీఎం 14వ జిల్లా మహాసభలు



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

అనంతపురం అర్బన్: ప్రజాసమస్యల పరిష్కారమే అజెండాగా ఉద్యమ కార్యాచరణ రూపొందించేలా సోమ, మంగళవారం రెండు రోజుల పాటు సీపీఎం 14వ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు ఆర్ట్స్ కళాశాల నుంచి లలితకళాపరిత్ వరకూ ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం అక్కడ జరిగే బహిరంగసభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొంటారన్నారు. 2021లో జరిగిన 13వ జిల్లా మహాసభల్లో తీసుకున్న కర్తవ్యాల అమలు తీరును సమీక్షించుకుంటామన్నారు. రాబోవు మూడేళ్లలో ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టే ఉద్యమ ప్రణాళికను రూపొందిస్తామన్నారు. మహాసభల్లో నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు బాలరంగయ్య, నగర కార్యదర్శి రామిరెడ్డి, కమిటీ సభ్యులు రామాంజినేయులు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం సెంట్రల్: పశు సంవర్ధక శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని సాయినగర్‌లో ఉన్న ఆస్పత్రిలో యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా వరప్రసాద్(మరూరు), కార్యదర్శిగా రంగనాయకమ్మ(శింగనమల), కోశాధికారిగా సాకే చంద్ర (శ్రీసత్యసాయి జిల్లా), వైస్ ప్రెసిడెంట్‌లుగా బాబునాయుడు(చియ్యేడు), ఆదినారాయణ, జాయింట్ సెక్రటరీగా రామాంజనేయులు, ఈసీ సభ్యులుగా ఆదినారాయణ, వన్నప్ప, మల్లికార్జున, సద్గురు మూర్తి, రాజేశ్వరి తదితరులు ఎన్నికయ్యారు.

ఆకట్టుకుంటున్న క్రిస్మస్ బొమ్మల కొలువు


గుంతకల్లు: క్రిస్మస్ సందర్భంగా గుంతకల్లులోని మస్తాన్‌పేట్‌లో నివాసముంటున్న రైల్వే విశ్రాంత ఉద్యోగి హృదయ్‌మోహన్ ఫెర్నాండేజ్, నిర్మలామేరి దంపతులు ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంటోంది. క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని విశదీకరించేలా బొమ్మలను కొలువుదీర్చారు. ఇందు కోసం తన ఇంటి మిద్దెపై ఓ ప్రత్యేక షెడ్‌ను ఏర్పాటు చేశారు. ఏసు పుట్టిన సమయంలో తోక్క చుక్క ఆవిర్భవించడం మొదలు... గొర్రెల కాపరుల చుట్టూ పెద్ద వెలుగు రావడం, అప్పటి నజరేతు, బెత్లహామ్, జెరుసలేము, ఈజిప్టు వాసుల వేషధారణ, సంప్రదాయాలు కళ్లకు కట్టినట్టు చూపించారు. ఈ సందర్భంగా ఫెర్నాండేజ్ మాట్లాడుతూ... దాదాపు రెండు నెలల పాటు శ్రమించి బొమ్మలను సేకరించి కొలువు దీర్చినట్లు తెలిపారు. నెల రోజుల పాటు సందర్శకుల కోసం బొమ్మల కొలువును ఉంచుతున్నట్లు పేర్కొన్నారు.



జెరుసలేములో చక్రవర్తుల భవనాల నమూనా



బెత్లహామ్ నగరంలోని ఇళ్లు, మనుషుల వేషధారణ, సంప్రదాయాలు తెలిపే బొమ్మలు



నజరేతు నగరంలోని భవనాలతోపాటు కొండగుట్టల ప్రాంతం



బొమ్మలకొలువు ఏర్పాటుకు సహకరించిన బంధువులతో ఫెర్నాండేజ్ దంపతులు

ఓటీ కోర్సు రద్దుకు కుట్ర

- సత్వర ఉపాధికి భరోసానిస్తున్న ఆఫ్తాల్మిక్ టెక్నీషియన్ కోర్సు
- రాష్ట్రంలో కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో మాత్రమే కొన్నేళ్లుగా నిర్వహణ
- వచ్చే విద్యా సంవత్సరం అడ్మిషన్లు చేపట్టరాదంటూ ప్రభుత్వ మౌఖిక ఆదేశాలు
- కోర్సును కొనసాగించాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

అనంతపురం ఎడ్యుకేషన్: నిరుపేద కుటుంబాల విద్యార్థులకు సత్వర ఉపాధికి భరోసానిస్తున్న ఇంటర్‌లో ఆఫ్తాల్మిక్ టెక్నీషియన్ (ఓటీ) ఒకేషనల్ కోర్సు రద్దుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేసింది. రాష్ట్రంలో ఒక్క అనంతపురంలోని కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో మాత్రమే ఈ కోర్సు అందుబాటులో ఉండడం గమనార్హం. ఏటా 35 నుంచి 40 మంది విద్యార్థినులు అభ్యసిస్తున్న ఈ కోర్సులో అత్యధికులు పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే ఉంటున్నారు. కోర్సు పూర్తికాగానే ఉపాధి లభిస్తుండడంతో మిగిలిన ఒకేషనల్ బ్రాంచ్‌లకంటే ఓటీకే డిమాండ్ ఎక్కువగా ఉంటోంది. అలాంటి డిమాండ్ ఉన్న కోర్సులో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు చేపట్టరాదంటూ ఇప్పటికే ఇంటర్ బోర్డు అధికారులకు ప్రభుత్వ పెద్దల నుంచి మౌఖిక ఆదేశాలు అందాయి. దీంతో ఈ కోర్సు రద్దు చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌కు ఇంటర్ బోర్డు కమిషనర్ కార్యాలయాధికారులు ఫోన్ ద్వారా స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని ప్రిన్సిపాల్ నాగరత్నమ్మను వివరణ కోరగా...ఆఫ్తాల్మిక్ టెక్నీషియన్ కోర్స్ రద్దు చేయనున్నట్లు కమిషనర్ కార్యాలయం నుంచి మౌఖిక ఆదేశాలు అందాయన్నారు. ఈ కోర్సు వల్ల పేద వర్గాల ఆడపిల్లలకు మంచి ఉపయోగముందంటూ 'సక్సెస్' లేఖ రాసి పంపినట్లు తెలిపారు.



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థినులు

ఎస్ఎఫ్ఐ ఆందోళన..

కేఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో అమలవుతున్న ఆఫ్తాల్మిక్ టెక్నీషియన్ కోర్స్‌ను కొనసాగించాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సప్తగిరి సర్కిల్ నుంచి బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడారు. ఓటీ కోర్సు చేసిన వెంటనే ఉపాధి లభిస్తోందన్నారు. ఇప్పటిదాకా ఈ కోర్స్ చేసిన వేలాదిమంది విద్యార్థినులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, ఆప్టికల్ క్లినిక్‌లో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. మరికొందరు ఉన్నత చదువులకు వెళ్తున్నారన్నారు. ఇలాంటి టెక్నికల్ కోర్స్‌ను మరింత అభివృద్ధి చేయాల్సింది పోయి నిర్వీర్యం చేయాలని చూస్తుండడం సిగ్గు చేటన్నారు. కోర్సు రద్దు చేయకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. రద్దు చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కమిటీ నాయకులు సోము, విజయ్, సాయి, ధనుష్, రాకేష్, కార్తీక్, విద్యార్థినులు హేమలత, దివ్యకళ, దీపిక, మమతా పాల్గొన్నారు.

ఉత్తమ రైతుగా గద్దె రమణారెడ్డి

రాప్తాడు: ద్రాక్ష సాగులో అత్యధిక దిగుబడి సాధించడమే కాక... తమ ప్రాంత రైతులకు అవగాహన కల్పించి, ద్రాక్ష సాగులో తోడ్పాటునందించిన రాప్తాడు మండలం హంపాపురం గ్రామానికి చెందిన రైతు గద్దె రమణారెడ్డిని ఉత్తమ రైతు పురస్కారంతో తెలంగాణ ప్రభుత్వం సత్కరించింది. వివరాలు... తనకున్న 5 ఎకరాల్లో రమణారెడ్డి గత ఏడాది దిల్ ఖుష్ రకం ద్రాక్ష సాగు చేపట్టి గణనీయమైన దిగుబడిని సాధించాడు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ వ్యవసాయాధికారులు అప్పట్లో రమణారెడ్డి తోటను సందర్శించి, ద్రాక్ష సాగు విధానాలను తెలుసుకున్నారు. అనంతరం దిగుబడులు వచ్చినప్పుడు మరోసారి క్షేత్ర సందర్శనకు వచ్చారు. అంతకు ముందు రైతు చెప్పినట్లుగానే ఎకరాకు 20 నుంచి 40 టన్నుల దిగుబడి సాధించడం, ఎకరాకు రూ.10 లక్షల దాకా ఆదాయాన్ని గడించడం తెలుసుకున్న అధికారులు ప్రత్యేక నివేదిక సిద్ధం చేసి తెలంగాణ ప్రభుత్వానికి అందజేశారు. దీంతో తెలంగాణలోనూ ద్రాక్ష సాగును అక్కడి ప్రభుత్వం ప్రోత్సహించింది. రైతు సూచనలు, సలహాలు పాటిస్తూ అక్కడి రైతులు అధిక పంట దిగుబడులు సాధించారు. దీంతో ఆదివారం నల్గొండ జిల్లా యాదాద్రిలో జరిగిన సమగ్ర వ్యవసాయ విజ్ఞాన సదస్సులో పుడమి పుత్ర పురస్కారాలను ప్రదానం చేశారు. ఆ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా రమణారెడ్డి, ఆయన సతీమణి పార్వతి పుడమి పుత్ర, కిసాన్ సేవా రత్న అవార్డును అందుకున్నారు.



తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గద్దె రమణారెడ్డి దంపతులు

పాత పనులు.. కొత్త బిల్లులు

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత స్థానిక టీడీపీ నేతలు ఉపాధి పథకంలో అక్రమాలకు తెరలేపారు. ఇందుకు సంబంధించిన ఆధారాలతో సీఎంకు ఓ టీడీపీ నేత చేసిన ఫిర్యాదు ప్రస్తుతం కలకలం రేపుతోంది. వివరాలు... బీకేఎస్ మండలంలోని సెంట్రల్ జైలు సమీపంలోని తాడిపత్రి రహదారి నుంచి జంతలూరులోని సెంట్రల్ యూనివర్సిటీ వరకూ రూ.4 కోట్లతో డబుల్ రోడ్డు వేశారు. ఆ సమయంలో రోడ్డుకు ఇరువైపులా జేసీబీతో మట్టి తీని తీయడంతో కాలువను తలపించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చూసేందుకు కాలువల కనిపిస్తున్న మార్గాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టీడీపీ సానుభూతిపరుడు నాగభూషణ అక్రమాలకు తెరలేపాడు. ఉపాధి పథకంలోని ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్ సహకారంతో రోడ్డు పక్కన కాలువ ఏర్పాటు పేరుతో వర్క్ ఐడీ 0212026004, ఐసీజీఐఎస్ 1390777 కింద పనులు చేపట్టాడు. అప్పటికే జేసీబీతో తవ్విన మార్గంలో పెరిగిన పిచ్చి మొక్కలను 10 మంది ప్రైవేటు కూలీలతో తొలగించి బిల్లులు చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత పక్కా ఆధారాలతో సీఎంకు ఫిర్యాదు చేయడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అవినీతి అక్రమాలకు పాల్పడిన ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని టీడీపీ నాయకుడు గుత్తా వెంకటనాయుడు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. అక్రమార్కులపై వేటు పడకుండా ఉన్నత అధికారులపై స్థానిక ప్రజాప్రతినిధి ఒత్తిళ్లు తీసుకెళ్లినట్లు ఆరోపించారు. అక్రమార్కులపై చర్యలు తీసుకునేంత వరకూ ఈ పోరాటం కొనసాగిస్తానంటూ సోషల్ మీడియాలో ఆయన పోస్టులు పెట్టడం గమనార్హం.



జేసీబీతో ఇదివరకే ఏర్పాటు చేసిన కాలువ

ఐటీడీపీ కార్యకర్తలపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బెళుగుప్ప: టీడీపీకి చెందిన సోషల్ మీడియాలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రులు విడుదల రజిని, ఆర్‌కే రోజాపై అసభ్యకర పోస్టింగ్ చేసిన ఐటీడీపీ కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం బెళుగుప్ప పీఎస్ ఎస్ఐ శివను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిన్న మచ్చన్న, నక్కలపల్లి సర్పంచ్ రామిరెడ్డి, పార్టీ మండల నాయకులు పాతన్న, వెంకటేశులు, పూలప్రసాద్, బాబురెడ్డి, నరిగన్న, ఎర్రిస్వామి తదితరులు కలసి ఫిర్యాదు ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా మచ్చన్న మాట్లాడుతూ... సోషల్ మీడియాలో మాజీ సీఎం వైఎస్ జగన్ పరువుకు భంగం కలిగేలా ఐటీడీపీ కార్యకర్తలు పోస్టింగ్ చేస్తున్నారని మండిపడ్డారు. వీరి చర్యల కారణంగా రాష్ట్రంలో ఇరుపార్టీల కార్యకర్తల మధ్య ప్రశాంతతకు భంగం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి కుట్రదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

● జాతి వైరం మరచి

రాయదుర్గం టౌన్: సహజంగా పందులు కనిపిస్తే కుక్కలు వెంటబడి తరుముతాయి. కుక్క పిల్లలు కనిపిస్తే పందులు కసితీరా గాయపరిచి చంపేస్తాయి. అలాంటిది జాతి వైరాన్ని మరిచి కుక్క పిల్లలకు పాలు ఇచ్చి మాతృత్వాన్ని చాటుకుంది ఓ వరాహం. ఈ అరుదైన ఘటన రాయదుర్గం లోని కోట ఏరియాలో శంకర మఠం వెనుక ఆదివారం వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన మేరకు... ఆ ప్రాంతానికి చెందిన ఓ వీధి కుక్క ఐదు పిల్లలకు జన్మనిచ్చి చనిపోయింది. దీంతో కొందరు కుక్క పిల్లలను తీసుకెళ్లి శంకరమఠం వెనుక నిర్జన ప్రదేశంలో వదిలేశారు. ఆకలితో అలమటిస్తున్న కుక్క పిల్లలను గమనించిన ఓ పంది తన స్తన్యం అందించి పాలు ఇచ్చింది. ఈ వింతను స్థానికులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు.



కుక్క పిల్లలకు పాలిస్తున్న వరాహం

అర్చకుడి కారుపై టీడీపీ అల్లరి మూక దాడి

పామిడి: ప్రఖ్యాతిగాంచిన పామిడి భోగేశ్వరాలయ ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మకు చెందిన మహేంద్ర జైలో కారు (ఏపీ02ఏఎన్4371)పై టీడీపీ అల్లరి మూక దాడి చేసింది. శనివారం అర్ధరాత్రి స్థానిక సంత మార్కెట్ వీధికి చెందిన అల్లరి మూక తప్పతాగి ఆలయం వద్ద భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలిగించసాగారు. దీంతో అర్చకుడు చంద్రశేఖర్ శర్మ, చుట్టుపక్కల నివాసముంటున్న వారు అల్లరి మూకకు సర్దిచెప్పబోయారు. ఆ సమయంలో వాగ్వాదం చోటు చేసుకోవడంతో స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని అల్లర్లకు పాల్పడుతున్న పృథ్వీ, మరికొందరిని అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. అదే సమయంలో స్థానిక టీడీపీ నేత జోక్యం చేసుకోవడంతో బయటకు వచ్చిన అల్లరి మూక నేరుగా ఆలయం వద్దకు చేరుకుని రామేశ్వరశర్మ కారుపై రాళ్లతో దాడి చేశారు. ఘటనలో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులు టీడీపీ నేత ఒత్తిళ్లకు తలొగ్గి అల్లరి మూకను వదిలేయడంపై పామిడి వాసులు మండిపడ్డారు. ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిజాయితీతో పనిచేస్తూ పోలీసు శాఖ ప్రతిష్టకు భంగం వాటిల్లకుండా చూడాలని హితవు పలికారు.

మరువవంకలో పడి యువకుడి మృతి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని మరువ వంకలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బీకేఎస్‌లోని చేపల కాలనీకి చెందిన అంకె విజయ్ (30) చేపల మార్కెట్‌లో దినకూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఆదివారం ఉదయం స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని మరువవంకలో బహిర్భూమికి వెళ్లిన విజయ్... ప్రమాదవశాత్తు వంకలో పడి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయుడి బలవన్మరణం

కూడేరు: డి.హీరేహాళ్ మండలంలో పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు భాస్కర్ బాబు (57) ఆత్మహత్య చేసుకున్నారు. అనంతపురంలో నివాసముంటున్న ఆయనకు భార్య సునీత, ఇద్దరు కుమారులు ఉన్నారు. సునీత కూడా టీచర్‌గా పని చేస్తున్నారు. ఆదివారం ఉదయం కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న అగ్రిగోల్డ్ వెంచర్ సమీపంలో క్రిమి సంహారక మందు తాగి విషయాన్ని తన స్నేహితుడికి ఫోన్ చేసి తెలిపారు. ఆయన ద్వారా సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు ఆగమేఘాలపై అక్కడకు చేరుకుని భాస్కర్‌బాబును వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే తన భర్త ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు సునీత ఫిర్యాదు చేసింది. ఘటనపై కూడేరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

శోకం నుంచి బయటపడేసే శక్తి కవిత్వానిది

- కవి వాడ్రేవు చినవీరభద్రుడు

అనంతపురం కల్చరల్: అంతులేని శోకం నుంచి సైతం వ్యక్తిని బయటపడేసి సంపూర్ణ ఆరోగ్యంగా జీవించేలా చేసే శక్తి కవిత్వానికి ఉందని రాధేయ నిరూపించారంటూ ప్రముఖ కవి వాడ్రేవు చినవీరభద్రుడు అన్నారు. ప్రతిష్టాత్మకంగా సాగే ఉమ్మడిశెట్టి సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం అనంతపురంలోని ఎన్జీఓ హోమ్‌లో జరిగింది. ఈ ఏడాది ఉమ్మడిశెట్టి జాతీయ యువ పురస్కారాన్ని బెంగళూరుకు చెందిన మానస చాపర్తికి, 36వ ఉమ్మడిశెట్టి జాతీయ పురస్కారాన్ని విశాఖపట్నానికి చెందిన సత్యనారాయణకు అందజేశారు. అనంతరం రాధేయ రచించిన 'అజేయుడు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అవార్డుకు ఎంపికైన డాక్టర్ బండి సత్యనారాయణ ఒంటికాలి పరుగు గ్రంథాన్ని డాక్టర్ పెళ్లూరు సునీల్, చాపర్తి మానస కవిత్వంపై డాక్టర్ సుంకర గోపాల్ సమీక్షించారు. సీనియర్ రచయిత్రి ప్రగతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశ్రాంత ఐఏఎస్ అధికారి, కవి చినవీరభద్రుడు ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. భార్య, కుమారుడు కానరాని లోకాలకు వెళ్లిపోయినా ఆ శోకాన్ని దిగమింగే శక్తి రాధేయకు కవిత్వం అందజేసిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ కథా రచయిత డాక్టర్ శాంతినారాయణ, షరీఫ్, చంద్రశేఖరశాస్త్రి, మధురశ్రీ, రియాజుద్దీన్, రాజారాం, ప్రముఖ చిత్రకారులు ఆమ్రపాలి, చెట్ల ఈరన్న తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడిశెట్టి యువ పురస్కారం అందుకుంటున్న మానస చాపర్తి

అశ్లీల పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: ఐటీడీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి ఆర్‌కే రోజా, పార్టీ అధికార ప్రతినిధి శ్యామల, డైరెక్టర్ రామ్‌గోపాలవర్మల వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగేలా అశ్లీల పోస్టింగ్‌లు పెట్టారని మండిపడ్డారు. వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఆదివారం కళ్యాణదుర్గం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

- రఘువీరా డిమాండ్

మడకశిర: అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు ఆక్షేపణీయమని, ఈ వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్లమెంట్‌లో జరిగిన చర్చ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని తెలిపారు. అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు సమాన హక్కులు కల్పించారని గుర్తు చేశారు. భారత ప్రజాస్వామ్య యుగంలో అంబేడ్కర్ కచ్చితంగా దేవుడేనని తెలిపారు.

అది మరణం కాదు.. హత్య!

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే హత్య
- మిస్టరీని ఛేదించిన ఆత్మకూరు పోలీసులు
- రిమాండ్‌కు నిందితులు



ఆత్మకూరు: ఓ సాధారణ మృతి కేసులో దాగి ఉన్న మిస్టరీని పోలీసులు ఛేదించారు. పోస్టు మార్టం నివేదిక ఆధారంగా హత్యగా నిర్ధారించుకున్న పోలీసులు ఆ దిశగా కేసు మార్చి దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటుకపల్లి సీఐ హేమంత్‌కుమార్, ఆత్మకూరు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన మేరకు...

11 నెలల క్రితం ఘటన..

ఆత్మకూరు మండలంలోని ముట్టాల గ్రామానికి చెందిన మట్టి పెద్దరాజులు(36)కు భార్య శివమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గొరిదిండ్ల సమీపంలోని హంద్రీ-నీవా కాలువ పక్కన తనకున్న పొలంలో గుడిసె వేసుకుని భార్యాపిల్లలతో నివసిస్తూ వ్యవసాయంతో పాటు వృషభాలకు రాతిదూలం లాగే శిక్షణ ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 30న పొలం పనులు చేసిన అనంతరం రాత్రి భోజనం చేసి నిద్రించాడు. 31న ఉదయం ఎంత లేపినా నిద్ర లేవకపోవడంతో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పెద్దరాజులు మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే అప్పట్లో పాము కాటుతోనో లేదా ఎద్దులు పొడవడం వల్లనో మృతి చెంది ఉంటాడని అందరూ భావించారు. ఆ దిశగానే భార్య శివమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నిజం బయటపెట్టిన పోస్టుమార్టం..

పెద్దరాజులు మృతి అనంతరం శివమ్మ కావాలనే తన అత్తమామలతో ఘర్షణ పడి మదిగుబ్బలోని పుట్టింటికి చేరుకుంది. ఈ క్రమంలోనే పెద్దరాజులు మృతదేహానికి వైద్యులు నిర్వహించిన పోస్టుమార్టం నివేదిక పోలీసులకు అందించింది. ఆయనది సాధారణ మరణం కాదని, ఊపిరి అందకుండా చేసి హతమార్చినట్లుగా నిర్ధారణ కావడంతో హత్య కేసుగా పోలీసులు మార్చి దర్యాప్తు చేపట్టారు. దీంతో వాస్తవాలు ఒక్కొక్కటిగా వెలుగు చూశాయి. హతుడి తమ్ముడు అనిల్‌తో శివమ్మకు వివాహేతర సంబంధం ఉందనే విషయం తెలిసింది. ఇదే సమయంలో తమ చుట్టూ పోలీసుల ఉచ్చు బిగుస్తోందని తెలుసుకున్న అనిల్, శివమ్మ ఈ నెల 21న వీఆర్వో మహమ్మద్ రఫీ సమక్షంలో పోలీసులకు లొంగిపోయారు. అనంతరం హత్య చేసిన వైనాన్ని వివరించడంతో వారిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం రిమాండ్‌కు తరలించారు.

ప్రశాంతంగా వదాన్య టాలెంట్ టెస్ట్



టాలెంట్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువులో ఆదివారం వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన వదాన్య టాలెంట్ టెస్ట్ -2024 ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 150 జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 9,10 వతరగతి చదువుతున్న 3400 మంది విద్యార్థులకు హాల్‌టికెట్లు జారీ చేయగా 3150 మంది హాజరయ్యారు. మొత్తం ఏడు కేంద్రాల్లో పరీక్ష జరిగింది. డీఎస్పీ విజయకుమార్, సీఐ ఇందిర పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్న ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగానికి వదాన్య ఫౌండర్ అశోక్ పడపాటి కృతజ్ఞతలు తెలియజేశారు. జనవరి 10న ఫలితాలు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

సీపీఎం మహాసభలు జయప్రదం చేయాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలు జయప్రదం చేయాలంటూ ఆదివారం ఆ పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ.. మహాసభల తొలిరోజు సోమవారం లలిత కళాపరిషత్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. రెండవ రోజు మంగళవారం స్థానిక గుత్తి రోడ్డులోని ఎస్ఎస్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. సభలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేంద్ర కుమార్, నాయకులు ఆర్‌వీ నాయుడు, వెంకటనారాయణ, గోపాల్, ముత్తూజా, ప్రకాష్, మసూద్, ఓబుళేసు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ పేరుతో రాజకీయం చేయొద్దు



రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేడ్కర్ పేరు చెప్పి రాజకీయం చేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదని ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా దేవానంద్ మాట్లాడుతూ.. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానించలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దీనిని వక్రీకరించి రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. అంబేడ్కర్ పేరుకు బదులు దేవుడి పేరు తలుచుకుంటే పుణ్యం వస్తుందని అనడంలో తప్పేమి లేదన్నారు. లేనిపోని తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంధిరెడ్డి శ్రీనివాసులు, వెంకటేశ్వర రెడ్డి, మందల శాంతకుమార్, శివశంకర్, గంగాదర్, తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజమే

అనంతపురం: ఇండోర్ స్టేడియం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంటర్నల్ బ్యాడ్మింటన్ షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్ .కృష్ణయ్య హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోటీల్లో గెలుపు ఓటమి సహజమని, వాటిని సమానంగా తీసుకోవడానికి క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో ఫర్టిలైజర్స్ రామాంజనేయులు, శేష, రెండో స్థానంలో రైపర్ రవీంద్రా రెడ్డి, టీచర్ శ్రీనివాస్ బాబు, మూడో స్థానంలో కాంట్రాక్టర్ హనుమంత రెడ్డి, జెడ్పీ బాబు నిలిచారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇండోర్ స్టేడియం అధ్యక్షుడు ఎన్‌వైకే శ్రీనివాస్, సెక్రెటరీ డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు. అనురాధ కన్‌స్ట్రక్షన్స్ ఆదినారాయణ కుమారుడు దిలీప్ కుమార్ టోర్నమెంట్ స్పాన్సర్‌గా వ్యవహరించారు.

ఘనంగా శారదా మాత జయంతి



ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

అనంతపురం కల్చరల్: మాతృమూర్తి శారదాదేవి జీవితం ఆదర్శప్రాయమని చిన్మయా మిషన్ జిల్లా ఇన్‌చార్జ్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి అన్నారు. స్థానిక రామకృష్ణ సేవా సమితి ప్రాంగణంలో సేవాసమితి అధ్యక్షుడు కృష్ణశెశి నేతృత్వంలో ఆదివారం శారదామాత 172వ జయంతి నిర్వహించారు. వివేకానంద యోగ కేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి, సుమతి తదితరులు శారదామాత జీవిత విశేషాలను వివరించారు. అంతకుముందు వేదపఠనం, శారదామాద దివ్యచరిత పారాయణం జరిగాయి. నూతన భవ ననిర్మాణానికి సహకరిస్తున్న దాతలను సత్కరించారు. సాయంత్రం శ్రీనృత్యకళానిలయం సంధ్యామూర్తి శిష్యబృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కూడేరు విద్యార్థులు స్వామి వివేకానంద, శారదామాత వేషధారణలో అలరించారు. ఎంపీ లక్ష్మీనారాయణ ఆత్మీయ అతిథిగా విచ్చేసి అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గుత్తి శ్రీధరమూర్తి, ప్రవీణ్ కుమార్ వేదాద్రి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదికి ప్రత్యేక బోధన

- ప్రభుత్వ పాఠశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహణ
- వంద శాతం ఉత్తీర్ణత, వెనుకబడిన విద్యార్థులపై దృష్టి



రాప్తాడు: విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి కీలకం. వీటి ఫలితాలపైనే వారి భవిత ఆధారపడి ఉంటుంది. దీంతో అటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ పరీక్షలకు ఎంతో ప్రాధాన్యమిస్తారు. ఈ నేపథ్యంలో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక చేపట్టింది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేయడంతో రెండో శని, ఆదివారాల్లో సైతం అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి దీన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు మిగిలిన వారు ఉత్తమ మార్కులు సాధించేలా దృష్టి సారిస్తున్నారు. విద్యార్థులు అభ్యసన స్థాయి పెరగడంతో పాటు వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించడానికి ఈ ప్రణాళిక దోహదపడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

రాప్తాడు నియోజకవర్గంలో..

రాప్తాడు నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో డిసెంబర్ నెల నుంచి మార్చి వరకు వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఆయా సబ్జెక్టుల టీచర్లు విద్యార్థులకు ప్రత్యేక సూచనలు ఇస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. 2025 సంవత్సరం మార్చి 17 నుంచి మార్చి 31 వరకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇటీవల విడుదల చేశారు. రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల్లో దాదాపుగా 50 ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో 2,550 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. గతంలో వచ్చిన ఫలితాలను బేరీజు వేసుకుని మరింత మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టు వారీగా విద్యార్థులకు అసైన్‌మెంట్స్ నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు వారికి ప్రత్యేక తర్ఫీదు ఇచ్చేలా ఉపాధ్యాయులు సన్నద్ధం చేస్తున్నారు.

అదనపు తరగతుల నిర్వహణ

వంద రోజుల ప్రణాళికలో భాగంగా రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఒక సబ్జెక్టు, సాయంత్రం మరో సబ్జెక్టు చదివిస్తున్నారు. అలాగే సెలవు రోజుల్లో కూడా టెన్త్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. ఉదయం ఒక సబ్జెక్టు, మధ్యాహ్నం మరో సబ్జెక్టు చదివిస్తున్నారు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులంతా ప్రతి ఒక్కరూ నలుగురు నుంచి 6 మంది విద్యార్థులను దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్న వారు ఎలా చదువుతున్నారు ?ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారు ? వారిలో భయాన్ని పోగొట్టి ఆత్మవిశ్వాసం నింపేలా కృషి చేస్తున్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషి చేస్తున్నాం. విద్యాశాఖ అందించిన 100 రోజుల ప్రణాళికను అమలు చేస్తూనే సెలవు దినాల్లోనూ అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా వెనుకబడిన వారిని ప్రత్యేక శ్రద్ధతో చదివిస్తున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు పాఠశాలల్లో ఉంటున్నందున అల్పాహారం అందించడానికి దాతలు స్పందించాలని కోరుతున్నాం.

– సాంబశివుడు, హెచ్ఎం, రాప్తాడు ఉన్నత పాఠశాల

స్టడీ అవర్స్‌తో ఉపయోగం



ఉదయం, సాయంత్రం పూట నిర్వహించే స్టడీ అవర్స్ ఉపయోగకరంగా ఉన్నాయి. ప్రతి అంశాన్ని ఉపాధ్యాయుల నుంచి నేర్చుకుంటున్నాం. మా అభ్యున్నతికి ప్రత్యేక ఏర్పాట్లు తీసుకుంటున్నారు. స్టడీ అవర్స్ పబ్లిక్ పరీక్షలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని నమ్ముతున్నాం. మంచి మార్కులు తెచ్చుకుంటాం.

– లిఖిత్ కుమార్, జెడ్పీ ఉన్నత పాఠశాల, రాప్తాడు

ప్రణాళిక ప్రకారం తరగతులు



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళిక ప్రకారం మాకు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం బాగుంది. వారు ఎప్పటికప్పుడు సలహాలు, సూచలనలు అందిస్తున్నారు. మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో 560 మార్కులకు పైగానే సాధిస్తా.

– అంజలి ప్రియ, జెడ్పీ ఉన్నత పాఠశాల, రాప్తాడు

కూటమి వైఫల్యాలను ఎండగట్టాలి



పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అనుబంధ సంఘాల అధ్యక్షులు

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల పక్షాన పోరాటాలు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల జిల్లా నూతన అధ్యక్షులకు పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. ఆదివారం అనంత వెంకటరామిరెడ్డిని అనుబంధ సంఘాల అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ.. అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లాబేగ్, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు బాకే హబీబుల్లా, బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడు అమర్‌నాథ రెడ్డి, ఇంటెలెక్చువల్ విభాగం అధ్యక్షుడు రమేష్ బాబు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, సోషల్ మీడియా అధ్యక్షుడు నరేంద్రనాథ్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆల్‌మేవా నాయకులు

అనంతపురం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వేల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ మేవా) ఉమ్మడి అనంతపురం జిల్లా శాఖ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఐదవ రోడ్డులోని మేవా కార్యాలయంలో జిల్లా స్క్రీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సంఘం బలోపేతానికి ప్రణాళిక, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు వై.ఫకృద్దీన్, జిల్లా అధ్యక్షుడు షేక్షావలి, ప్రధాన కార్యదరశి ఫారూక్ మహమ్మద్ విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. పీఆర్‌సీ, పెండింగ్ డీఏలు వెంటనే ప్రకటించాలన్నారు. సరెండర్ లీవులు, జీపీఎఫ్ రుణాల మంజూరు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, మరణించిన పెన్షనర్ల అంతిమ సంస్కారాల బిల్లులు ఇవ్వాలన్నారు. క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్, ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ఈహెచ్‌ఎస్ కార్డులపై ఉచిత వైద్య సేవల అందించేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలన్నారు. సొంత ఇల్లు లేని ప్రభుత్వ ఉద్యోగులకు రాయితీపై వారు పనిచేసే చోట ఇళ్ల సముదాయాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి గ్రాట్యూటీ, ఎన్‌క్యాష్ ఆఫ్ ఎర్న్ లీవ్, తదితర సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నియామకాలకు నిర్వహించే పరీక్షల్లో ముస్లింలకు ఓబీసీ రిజర్వేషన్లు అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో పీఎంజేవీకే పథకం ద్వారా మంజూరైన భవన సముదాయాలను త్వరగా పూర్తి చేసి మైనారిటీలకు అప్పగించాలన్నారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు అష్రిఫ్ అలీ, మహబూబ్ బాషా, జిలాన్, దౌలా, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి

అనంతపురం సెంట్రల్: మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. ఆదివారం పశువుల సంతను తనిఖీ చేశారు. పశువుల వ్యాపారులు, రైతులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. భోజన వసతి కల్పించాలని రైతులు విజ్ఞప్తి చేయగా.. త్వరలోనే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నిర్దేశించిన మేరకే సుంకం వసూళ్లు చేయాలని అధికారులను ఆదేశించారు. యార్డులో సౌకర్యాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ప్రవక్త బోధనలు అనుసరణీయం



మాట్లాడుతున్న హసన్‌రజా ఖాద్రి



ప్రవక్త వస్తువులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: విశ్వాసం మాత్రమే మనిషిని స్వర్గం చేరేలా చేస్తుంది. అందరూ ప్రవక్త అనుసరించిన బాటలో నడవాలని మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన అబ్దుల్ ఖాదిర్, తెహరిక్ అధ్యక్షుడు హసన్‌రజా ఖాద్రి, తౌషిఫ్ రజా తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక కొత్తూరు జూనియర్ కళాశాల మైదానంలో తెహరిక్ ఫైజానే ఉమర్ ఫారూక్ వారి 15వ వార్షికోత్సవం సందర్భంగా సున్ని ఇజ్‌తెమా ఘనంగా జరిగింది. తప్పులు చేయడం మానుకోవడం తెలియక చేసిన తప్పులకు పాశ్చాత్తాపం పొందడం అనేవి జ్ఞానమార్గాలని పేర్కొన్నారు. వివేకవంతులైన వారు నిత్య ప్రార్థనలతో భగవంతుడిని ఆరాధిస్తారన్నారు. ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో కొలిచే మహ్మద్ ప్రవక్త పవిత్ర కేశాలు, ఆయన వాడిన వస్తువులు, ధరించిన దుస్తుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే దూరప్రాంతాల నుంచి విచ్చేసిన వారందరికి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ముతవల్లి ఫరీదుద్దీన్, డాక్టర్ షఫీ, పర్వేష్, షబ్బీర్ అహ్మద్, అబ్దుల్ సమీ, చాంద్‌బాషా పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు ‘అమ్మ’ సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న తరిమెల రమణారెడ్డి, ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు

అనంతపురం కల్చరల్: అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి సేవలు స్ఫూర్తిదాయకమని శ్రీసత్యసాయి జిల్లా అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు అన్నారు. స్థానిక అరవింద నగర్‌లోని అనాథ అంధుల ఆశ్రమంలోని 40 మంది విద్యార్థులకు ఆదివారం అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి రూ.40 వేలు విలువైన పరుపులు, బెడ్‌షీట్లు అందజేశారు. కనగానపల్లి మండలం, మద్దెలచెరువు గ్రామానికి చెందిన ఓ అంధురాలికి ఫీజు కట్టేందుకు రూ.40 వేలు అందించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు మాట్లాడుతూ.. అంధులైన విద్యార్థులకు గతంలోనూ రమణారెడ్డి ఎన్నో సార్లు సాయమందించారన్నారు. ముఖ్యంగా ఉన్నత చదువుల కోసం స్టడీ మెటీరియల్స్ ఇచ్చి ప్రోత్సహించారని కొనియాడారు. తరిమెల రమణారెడ్డి మాట్లాడుతూ.. పదిమందికి సాయపడడానికి దేవుడు శక్తినిచ్చాడన్నారు. అంధులైన దివ్యాంగ విద్యార్థులకు భవిష్యత్తులోనూ విద్య, వైద్య సౌకర్యాలు కల్పించడానికి తోడ్పాటునందిస్తానని తెలిపారు.

పోలీసులపై చర్యలు తీసుకోండి



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

అనంతపురం/అనంతపురం ఎడ్యుకేషన్: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులపై దౌర్జన్యం చేసిన వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్ఐ డి.శ్రీనివాసులుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఏబీవీపీ నాయకులను బూట్ కాళ్లతో తంతూ మెట్లపై ఈడ్చుకెళ్తూ అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. కొంత మంది ఏబీవీపీ కార్యకర్తలను కులం పేరుతో దూషించారని ఆరోపించారు. వీటినన్నింటినీ సెల్ ఫోన్‌లో రికార్డు చేసిన దృశ్యాలను బలవంతంగా లాక్కొని పోలీసులు తొలగించారన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జేఎన్‌టీయూ అనంతపురంలో సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తే పోలీసుల దౌర్జన్యం వెలుగులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ ఉమ్మడి అనంతపురం జిల్లా కన్వీనర్ (విభాగ్) అఖిల్ కుమార్ రెడ్డి, ఎస్‌డబ్ల్యూసీ మెంబర్ దివాకర్ నాయక్, నాయకులు విజయ్, బాబు, భూతరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ.. అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించక పోగా.. సమర్థించి మాట్లాడటం బాధాకరమన్నారు. అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపటినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా స్పందించక పోతే అన్ని కుల, ప్రజా సంఘాలు కలుపుకోని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. క్యాక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ నల్లప్ప, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ కోడవండ్ల, నాయకులు కుంటి మద్ది ఓబులేసు, రాజు, బాల పెద్దన్న, ఓబులేసు, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహులు, ఏసన్న, ఆనంద్, ఇమామ్, పులి కిష్ట, చంద్రచర్ల హరి, ఐఎంఎం బాష, మాధవ్, దాసరి ఆదినారాయణ, నారాయణప్ప, గుజ్జల పోతలయ్య, హనుమన్న, ఉమామహేశ్వరి, కుళ్ళాయి స్వామి, వీరేంద్ర ప్రసాద్, మల్లికార్జున, నాగరాజు, రామకృష్ణ, చంద్రబాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయి మందిరం అధ్యక్షుడిగా లక్ష్మీరెడ్డి

అనంతపురం కల్చరల్: నగరంలోని మూడవ రోడ్డు షిర్డీ సాయిబాబా మందిరం అధ్యక్షుడిగా గంగన లక్ష్మీరెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం మందిరం వేదికగా షిర్డీ సాయి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జయచంద్ర చౌదరి నేతృత్వంలో సాగిన సమావేశంలో నూతన పాలక మండలిని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఎన్నికైన గంగన లక్ష్మీరెడ్డి మాజీ కార్పొరేటర్‌గా సేవలందించారు. ప్రస్తుతం ఈయన కో–ఆప్షన్ మెంబర్‌గా ఉన్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా గంగిరెడ్డి, శశిధర్, ప్రధాన కార్యదర్శిగా నాగేంద్ర ప్రసాద్, సెక్రటరీగా రఘురామారావు, జాయింట్ సెక్రటరీలుగా సోమర జయచంద్ర నాయుడు, మధుసూదన్, ట్రెజరర్‌గా సతీష్ కుమార్ నూతన పాలక మండలిలో చోటు దక్కించుకున్నారు.

సచివాలయ కార్యదర్శులపై వేటు

- సర్వే విధులను నిర్లక్ష్యం చేయడంతో ముగ్గురు సస్పెండ్

అనంతపురం అర్బన్: నగర పరిధిలో ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) సర్వే విధులను నిర్లక్ష్యం చేశారంటూ ముగ్గురు వార్డు సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శులపై చర్యలు తీసుకున్నారు. వీరిని సస్పెండ్ చేస్తూ వారి స్థానంలో మరొకరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. 49వ వార్డు సచివాలయ కార్యదర్శి జి.దినేష్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ 44వ వార్డు కార్యదర్శికి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. 48వ వార్డు కార్యదర్శి బి.రేణుకను సస్పెండ్ చేస్తూ 43వ వార్డు కార్యదర్శి రుక్సానా బేగంకు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చారు. 71 వార్డు కార్యదర్శి ఎం.వనితను సస్పెండ్ చేస్తూ 72వ వార్డు కార్యదర్శి పుష్పావతికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.


సపోజ్ క్రిస్మస్ సందడి



క్రిస్మస్ వేడుకల్లో కాగజ్‌ఘర్ రిజ్వాన్, తదితరులు

అనంతపురం కల్చరల్: క్రిస్మస్‌ను పురస్కరించుకుని స్థానిక ఆజాద్ నగర్‌లోని క్రైస్తవులకు ఆదివారం చంద్రయాన్ సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యావసరాలు అందజేశారు. వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవ అన్నది మనిషి పాటించి మోక్షం పొందాలన్నారు. చంద్రయాన్ సేవా సమితి వారు సేవాభావంతో నిత్యావసర వస్తువులు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఆదరణ సేవా సంస్థ లాల్‌బాషా, గరీబ్ క దర్ద్ అధ్యక్షుడు జిలాన్‌బాషా, జమాతే ఇస్లామీ హింద్ హాజీపీరా, వైఎస్సార్‌సీపీ నాయకులు గఫార్ చర్చి సంఘం కాపరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆ పాత మధురాలు



విజయ్ రాఘవన్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: స్థానిక హౌసింగ్ బోర్డులోని రాజీవ్ పార్కులో పద్మశ్రీ ఘంటసాల సంగీత సాంస్కృతిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘంటసాల 102వ జయంతి ముగింపు ఉత్సవాలు జరిగాయి. స్వర నీరాజనం పేరుతో జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన 25 మంది గాయనీ గాయకులు ఆ పాత మధురాలను ఆలపించి ఆకట్టుకున్నారు. ఘంటసాల ట్రస్టు భవనానికి రూ.లక్ష విరాళం ప్రకటించిన విశ్రాంత రెవెన్యూ అధికారి విజయ్‌రాఘవన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పాత పాటల ప్రేమికుల సంఘం నిర్వాహకులు ఓబుళదాసు, ఆకాశవాణి సీనియర్ వ్యాఖ్యాత డాక్టర్ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి, ఘంటసాల ఆరాధన సమితి రామయ్య పాల్గొన్నారు.

పంపనూరు

ఆలయ సిబ్బందికి డ్రెస్ కోడ్



డ్రెస్ కోడ్‌లో ఆలయ ఈఓ బాబు, సిబ్బంది

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పని చేస్తున్న సిబ్బందికి కమిషనర్, దేవదాయ ధర్మదాయ శాఖ విజయవాడ వారి ఆదేశాల మేరకు డ్రెస్ కోడ్ ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ బాబు తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి హుండీ కానుకలను సోమవారం లెక్కిస్తామని పేర్కొన్నారు. కానుకల లెక్కింపునకు వచ్చే భక్తులు సాంప్రదాయ దుస్తుల్లో రావాలని సూచించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజా కార్యక్రమాలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం స్వామి వారి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో కాలసర్పదోష నివారణ రాహు కేతు హోమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున దీపాలను వెలిగించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవికి పూజలు చేసి, మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.